

పక్కన గోదారి.. పొలాలు ఎడారి

దుమ్ముగూడెం ఆనకట్ట సమీపంలోని కుమ్మరిగూడెం ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. 10లో



మాస్టర్ ప్లాన్‌కు కసరత్తు

కొత్తగూడెంలోని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో నూతన భవనాల నిర్మాణానికి అధికారులు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31°/ 24°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి, సాయంత్రం అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శ్రీ దుర్గాదేవిగా పెద్దమ్మతల్లి



దుర్గాదేవిగా దర్శనమిస్తున్న పెద్దమ్మతల్లి

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవ రాత్రుల మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం శ్రీ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో చండీహోమం, లక్ష కుంకుమార్చన, శ్రీ అంజనేయస్వామికి ఆకుపూజ, శివాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కాలభైరవస్వామికి పంచామృతాభిషేకం గావించారు.

ఐటీడీఏ డీడీగా అశోక్



అశోక్‌ను అభినందిస్తున్న కార్యాలయ సిబ్బంది

భద్రాచలం : భద్రాచలం ఐటీడీఏలోని విద్యా శాఖ విభాగంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీగా(పూర్తి అదనపు బాధ్యతలు) జి.అశోక్‌కు పీఓ రాహుల్ నిర్ణయించారు. ఈ మేరకు ఆయన మంగళవారం డీడీ మణెమ్మ నుంచి బాధ్యతలు స్వీకరించారు. అశోక్ ప్రస్తుతం ఐటీడీఏలో ఏటీడీఓగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన అశోక్‌కు కార్యాలయ సిబ్బంది అభినందనలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏలో విద్యా రంగ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సింగరేణి(కొత్తగూడెం): సైబర్ నేరాల పట్ల సింగరేణి ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సీఎండీ ఎన్.బలరామ్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. కార్మికులకు దసరా అడ్వాన్స్, లాభాల బోనస్‌ను వారి ఖాతాల్లో జమ చేశామని, త్వరలో దీపావళి బోనస్ కూడా అందిస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తారని, అలాంటి వారి మాటలు నమ్మి అకౌంట్ నంబర్లు, ఓటీపీలు చెప్పొద్దని కోరారు.

సింగరేణి ప్రధాన కార్యాలయంలో షేర్ హోల్డర్ల సమావేశం

కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సీఎండీ ఎన్.బలరామ్ అధ్యక్షతన మంగళవారం కంపెనీ షేర్ హోల్డర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాలు, వ్యయం, నూతన ప్రాజెక్టులు, షేర్ హోల్డర్లకు డివిడెంట్ల కేటాయింపు, సీఎస్సార్ నిధుల కేటాయింపుపై చర్చ జరిగినట్లు సమాచారం. అలాగే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్త ప్రాజెక్ట్‌లకు అనుమతుల సాధన తదితర అంశాలపై చర్చించి, తీర్మానం చేసినట్లు తెలిసింది. ఈ సమావేశంలో షేర్ హోల్డర్లు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు, కోలిండియా ప్రతినిధులు, సింగరేణి డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆశలు ఆవిరి!

గోదావరిని వీడని వరదలు

- మళ్లీ నీటమునుగుతున్న పంటలు
- పరీవాహక రైతులకు తీరని నష్టం
- వానాకాలం పంట సాగుకు ఇక సెలవే..



బూర్గంపాడు వద్ద వరదనీటిలో పత్తి చేను

బూర్గంపాడు: గోదావరి వరదలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలోని పరీవాహక ప్రాంత రైతులు ఈ సీజన్‌లో ఇప్పటికే మూడుసార్లు నష్టపోగా.. మంగళవారం గోదావరి వరద నీటిమట్టం 50 అడుగులకు చేరడంతో వందల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. దీంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆగస్టు నుంచి ఇప్పటివరకు మూడుసార్లు గోదావరికి వరదలు రావడంతో పత్తి, మిర్చి, అపరాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

ఆలస్యంగా సాగు చేసినా..

భద్రాచలం డివిజన్‌లోని బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని గోదావరి పరీవాహక ప్రాంత రైతులకు వరదలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వరదల నేపథ్యంలో ఆయా మండలాల రైతులు వానాకాలం పంటల సాగు కొంత ఆలస్యంగా ఆగస్టు 15 తర్వాతే ప్రారంభిస్తారు. ఈ ఏడాది ఆగస్టు 15 వరకు అంతగా వరదలు రాకపోవడంతో పత్తి, మిర్చి, అపరాలు, కూరగాయల పంటలు వేశారు. అయితే ఆ నెలాఖరులో వరదలు రావడం, గోదావరి ప్రవాహం 53 అడుగులకు చేరడంతో విత్తనాలు, మొలకలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో సెప్టెంబర్ మొదటి వారంలో మళ్లీ పత్తి విత్తనాలు వేశారు. ఈ మొక్కలు మొలిచి ఏపుగా పెరుగుతున్న సమయంలో మరోసారి గోదావరి ముంచెత్తగా ఆ పంటలూ పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో విత్తనాలు అందుబాటులో లేక కొందరు రైతులు పత్తి సాగుకు దూరంగా ఉండగా ఇంకొందరు మాత్రం దూర ప్రాంతాల నుంచి విత్తనాలు తెచ్చి సెప్టెంబర్ మూడో వారంలో వేశారు. ఆ గింజలు మొలిచి మొక్కలు ఎదుగుతున్న తరుణంలో గత రెండు, మూడు రోజులుగా గోదావరికి భారీగా వరద పెరిగింది. దీంతో ముచ్చటగా మూడోసారి పంట కూడా వరదార్పణమైంది.

మిరపదీ అదే పరిస్థితి..

గోదావరి పరీవాహకంలో వరదలకు పత్తి దెబ్బతిన్నాక కొందరు రైతులు మిరప సాగు చేపట్టారు. ఈ పంటకు పెట్టుబడి ఎక్కువ, లాభం తక్కువైనా అదును దాటిపోతుందనే కారణంతో సాగు చేపట్టారు. తల్లాడ, వైరా తదితర ప్రాంతాల నుంచి మిరప నారు తీసుకొచ్చారు. అయితే ప్రస్తుత వరదలతో ఈ పంట కూడా నీటమునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇంకొందరు మినుము, పెసర, కంది, కూరగాయల పంటలు సాగు చేయగా అవి కూడా మునగడంతో లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం చిరుపొట్ట దశలో ఉన్న వరి కూడా నీటమునిగితే దిగుబడి గణనీయంగా తగ్గుతుందని ఆందోళ చెందుతున్నారు.

వదిలేయడమే మేలు..!

వరుసగా మూడుసార్లు వేసిన పంటలు వరదలకు నష్టపోవడంతో రైతులు ఈ ఏడాది వానాకాలం పంటను పూర్తిగా వదిలేయాలని నిర్ణయించుకుంటున్నారు. నవంబర్‌లో రెండో పంట వేసుకోవడమే మంచిదని అంటున్నారు. కొందరు రైతులు పత్తి, మిర్చికి బదులు యూకలిప్టస్, సుబాబుల్ వంటి పంటల సాగుకు మొగ్గుచూపుతున్నారు.

వరి మూడుసార్లు మునిగింది

ఆగస్టు రెండో వారంలో వేసిన వరి ఇప్పటికి మూడుసార్లు నీట మునిగింది. వరదలొచ్చిన ప్రతీసారి తేరుకునేందుకు 15 రోజులు పడుతోంది. వరి నారు పోసి రెండునెలలైనా వరదల కారణంగా దుబ్బు చేయలేదు. ఈ ఏడాది ఎకరాకు పది బస్తాలు కూడా పండేలా లేదు.

– యడమకంటి లింగారెడ్డి, రెడ్డిపాలెం

పత్తి మూడుసార్లు వేశా

గోదావరి వరదలతో ఇప్పటికి మూడుసార్లు వేసిన పత్తి దెబ్బతిన్నది. ఆగస్టు నుంచి ఇప్పటివరకు మూడు సార్లు వేయగా మొక్కలు ఎదుగుతున్న సమయంలోనే గోదావరి వరదలు వస్తున్నాయి. ఇప్పటికే ఎకరాకు రూ.15 వేల వరకు ఖర్చయింది. ఇప్పుడు మళ్లీ పత్తి వేద్దామన్న విత్తనాలు దొరకడం లేదు.

– చెంచలపు రాములు, నాగినేనిప్రోలు

వీరలక్ష్మీ.. పాహిమాం

- అమ్మవారిని తిలకించి పులకించిన భక్తులు
- నేడు నిజరూప దర్శనం
- రేపు శమీ, ఆయుధ పూజ, శ్రీరామలీలా మహోత్సవం



వీరలక్ష్మి అలంకరణలో అమ్మవారు

భద్రాచలం : ముగ్గురమ్మల శక్తి స్వరూపిణిగా, దారిద్ర్యాలను పారదోలే వీరలక్ష్మిగా సాక్షాత్కారమైన అమ్మవారిని తిలకించిన భక్తులు పులకించిపోయారు. శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోగా, అమ్మవారు మంగళవారం వీరలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో చివరి రోజైన బుధవారం అమ్మవారికి నిజరూపమైన శ్రీ మహాలక్ష్మిగా అలంకరించనున్నారు. గురువారం విజయదశమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరగనున్నాయి. దసరా మండపంలో శమీ, ఆయుధ పూజతో పాటుగా రావణాసుర వధగా పేర్కొనే శ్రీరామలీలా మహోత్సవం కనులపండువగా జరగనుంది.

నేటి అలంకార విశిష్టత..

ధనం, ధాన్యం, సంతానం, విద్య, అధికారం, విజయం, ఐశ్వర్యం.. ఇలా మనిషికి అవసరమైన అష్టైశ్వర్యాలను ప్రసాదించేందుకు అష్టలక్ష్మీ రూపాలను ధరించిన ఆదిలక్ష్మీ.. కరుణాస్వరూపమైన తన నిజ రూపంలో భక్తులను అనుగ్రహిస్తుందని పండితులు చెబుతున్నారు.

కమనీయం.. నిత్యకల్యాణం..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్థానిక సంస్థల ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 22 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ స్థానాలు ఉండగా మొదటి విడతలో భద్రాచలం డివిజన్‌లోని 11 మండలాల్లోని 11 జెడ్పీటీసీ, 113 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తామని, ఇందుకు 602 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రెండో విడతలో కొత్తగూడెం డివిజన్‌లోని 11 జెడ్పీటీసీ, 120 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనుండగా 669 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతీ విడతలో 20 శాతం అదనపు రిజర్వ్ కేంద్రాలు కూడా సిద్ధంగా ఉంచుతామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున అధికారులు ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనవద్దని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, పబ్లిక్ పార్కులతో పాటు ప్రధాన కూడళ్లలో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలు, హోర్డింగులు, బ్యానర్లు, స్టిక్కర్లు తొలగించాలని సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసేలా గోడలపై రాసిన నినాదాలను చెరిపేయాలన్నారు. ఎస్పీ రోహిత్‌రాజ్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా నగదు, మద్యం పంపిణీని అరికట్టేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. సమావేశంలో భద్రాచలం సబ్‌కలెక్టర్ మ్రిణాల్‌శ్రేష్ఠ, అదనపు కలెక్టర్లు డి. వేణుగోపాల్, విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీపీఓ చంద్రమౌళి, ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు మీడియా కూడా సహకరించాలని కోరారు. ఫేక్ వార్తలతో ఘర్షణలు చెలరేగుతాయని, ఈ విషయంలో పారదర్శకంగా ఉండాలని అన్నారు. అంతకుముందు రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. పోలింగ్ ప్రశాంతంగా సాగేలా ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. పోటీలో ఉండే అభ్యర్థుల ఖర్చుల నమోదు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అంశాలపై చర్చించారు. సభలు, సమావేశాలతో పాటు కరపత్రాలు, ఫ్లెక్సీలు తదితర అన్ని కార్యక్రమాలు నిశితంగా పరిశీలిస్తామని అన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, డీఎల్‌పీఓ సుధీర్, ఆయా పార్టీల నాయకులు అజ్మీరా సురేష్, అనుదీప్, సలిగంటి శ్రీనివాస్, నోముల రమేష్, సత్యనారాయణ, గౌని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శిశు మరణాల నివారణపై దృష్టి పెట్టాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చుంచుపల్లి: జిల్లాలో నవజాత శిశు మరణాల నివారణపై వైద్య శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన వైద్య శాఖ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎస్‌ఎన్‌సీయూలో జరుగుతున్న నియోనేటల్ మరణాలను సింగిల్ డిజిట్‌కు తీసుకురావాలని సూచించారు. ఇందుకోసం కావాల్సిన సిబ్బందిని, వనరులను సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. శిశువు పుట్టిన 28 రోజుల్లోపు సంరక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. నెలలు నిండకుండా పుట్టిన, అనారోగ్యంతో ఉన్న నవజాత శిశువులకు అత్యవసర, ప్రత్యేక వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి, వైద్యులు రామకృష్ణ, రాధామోహన్, తేజశ్రీ, మధువరణ్, పుల్లారెడ్డి, స్పందన తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ సీఈ ఉద్యోగ విరమణ



శ్రీనివాసరెడ్డి

పాల్వంచరూరల్: జలవనరుల శాఖ జిల్లా చీఫ్ ఇంజనీర్‌గా నాలుగున్నరేళ్ల పాటు విధులు నిర్వర్తించిన శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. 2021లో సీఈగా పదోన్నతిపై ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత ఆయన హైదరాబాద్‌లో కూడా ఇన్‌చార్జ్ సీఈ బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం శ్రీనివాసరెడ్డి ఉద్యోగ విరమణతో రెండు చోట్ల సీఈ పోస్టు ఖాళీ కాగా, ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు.


పెచ్చుమీరిన కాంగ్రెస్ నేతల దౌర్జన్యాలు

ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు

ఖమ్మంవైరారోడ్: ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ నాయకుల అరాచకాలు పెచ్చుమీరిపోయాయని.. బీఆర్‌ఎస్ శ్రేణులపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మండిపడ్డారు. అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు వేధించడంతోనే తమ పార్టీ నాయకుడు బానోత్ రవి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతితో కలిసి ఖమ్మంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. జిల్లా మంత్రులు అభివృద్ధిపై దృష్టి సారించకుండా బీఆర్‌ఎస్ నాయకులను రాజకీయంగా అణచివేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిని ఇబ్బంది పెట్టడం నిత్యకృత్యంగా మారిందని తెలిపారు.

రెండో ప్రమాద హెచ్చరిక దాటి..

- గోదావరిలో 49.70 అడుగులకు నీటిమట్టం
- ఆందోళన చెందుతున్న రైతులు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన





భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి (ఇన్‌సెట్) చర్ల : నీటమునిగిన దండుపేట - కొత్తపల్లి రహదారి

భద్రాచలంటౌన్ : భద్రాచలం వద్ద గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక దాటి ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమవారం రాత్రి వరకు మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగగా, మంగళవారం తెల్లవారు జామున 3.30 గంటలకు 48 అడుగులకు చేరడంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆ తర్వాత గంటగంటకూ పెరుగుతూ మంగళవారం సాయంత్రం 5 గంటలకు 50 అడుగులకు చేరింది. దీంతో అధికారుల అప్రమత్తమై నాలుగు చోట్ల కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. వరద తీవ్రత ఇంకా పెరిగితే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిలిచిన రాకపోకలు..

భద్రాచలం నుంచి చర్ల, వెంకటాపురం రహదారిపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దసరా ఉత్సవాల నేపథ్యంలో భద్రాచలం వచ్చే భక్తులు స్నానాల కోసం గోదావరిలోకి దిగకుండా ఇనుప కంచె, ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు నీటిమట్టం 50 అడుగుల వద్ద నిలకడగా ఉంది. ఆ తర్వాత స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. అయితే ఎగువన పేరూరు వద్ద గోదావరి ప్రవాహం కొంతమేర తగ్గిందని, ఈ క్రమంలో భద్రాచలంలో కూడా తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కాగా, రాత్రి 10 గంటలకు 49.70 అడుగులుగా నమోదైంది.

ముంపు బారిన పంటలు..

గోదావరి నీటిమట్టం పెరుగుతుండడంతో పరీవాహక ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. వారికి అక్టోబర్ ఎంతో విలువైంది. ఈ నెలలోనే పత్తి, వరి పంటలకు పాట్లు చేయడం సహా మిర్చి సాగు పనులు ప్రారంభిస్తారు. ఈ క్రమంలో వరద నీటితో పంటలు, మిర్చి సాగు చేసే భూములు ముంపునకు గురికావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వరి, పత్తి రైతులకు ఈ వరదలు తీవ్ర నష్టాన్ని మిగుల్చుతున్నాయి. గోదావరి పరీవాహక ప్రాంతాలైన చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, అశ్వాపురం, బూర్గంపాడు, మణుగూరుతో పాటు ఏపీలోని పలు మండలాల్లో ఇప్పటికే పంటలు ముంపనకు గురయ్యాయి.

వరదనీటిలో కొత్తపల్లి – దండుపేట రహదారి

చర్ల: గోదావరి వరద దోబూచులాడుతోంది. వరద వచ్చినప్పుడల్లా పంటలతో పాటు ప్రధాన రహదారులను ముంచెత్తుతుండగా ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. తాజాగా రెండు రోజుల నుంచి గోదావరి వరద పెరుగుతుండగా గుంపెన్నగూడెం, దండుపేట, తేగడ, ఆంజనేయపురం, కుదునూరు, దేవరాపల్లి తదితర గ్రామాల్లో వరి, పత్తి పంటలు నీటమునిగాయి. ఇప్పటికే పలుమార్లు నీట మునిగిన పంటలు మళ్లీ ముంపునకు గురి కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరదల నేపథ్యంలో రవాణాకూ ఇక్కట్లు ఎదురవుతున్నాయి. మండలంలోని దండుపేట - కొత్తపల్లి రహదారి నీటమునిగింది. తేగడలోని తాలిపేరు హైలెవల్ వంతెన వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

వరదల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ సూచించారు. గోదావరి వరద ఉధృతిని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. స్నానాల కోసం ఎవరూ గోదావరిలోకి దిగవద్దని, అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. అత్యవసర పరిస్థితి తలెత్తితే భద్రాచలం సబ్ కలెక్టరేట్‌లోని 08743-232444, కంట్రోల్ రూమ్ నంబర్ 7981219425, ఐడీఓసీలోని 08744-241950, ఐటీడీఏ కార్యాలయంలోని 79952 68352 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎన్నికల నిర్వహణ ఎలా ?

- స్థానిక పోరుకు నిధుల కొరత
- ఒక్కో మండలానికి రూ.2 లక్షల వ్యయం
- ఆర్థికభారంతో అధికారుల సతమతం
- ప్రత్యేక గ్రాంట్ కోసం ఎదురుచూపులు



చుంచుపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నా.. నిధులు అందుబాటులో లేక అయోమయంలో పడ్డారు. ఎన్నికల ఏర్పాట్లకు ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ విడుదల చేయలేదు. ఈ క్రమంలో ఈనెల 23, 27 తేదీల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు రెండు విడతలు, 31, నవంబర్ 4, 8 తేదీల్లో పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించడం ఎలా అని సందిగ్ధం వారిలో నెలకొంది. ఇప్పటికే ఓటర్ల జాబితాల రూపకల్పన నుంచి పోలింగ్ సామగ్రి, రవాణా ఖర్చులు చాలా అయ్యాయని వాపోతున్నారు. ఈ క్రమంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా గ్రాంట్ రాకుంటే ఎలా అని తల పట్టుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అప్పు తెచ్చి మరీ ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలానికి రూ.2 లక్షలు..

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మొదట జిల్లాలో 22 జెడ్పీటీసీలు, 233 ఎంపీటీసీలకు రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. ఆ తర్వాత 471 గ్రామ పంచాయతీలు, 4,168 వార్డులకు మూడు విడతల్లో పోలింగ్‌ను నిర్వహించనున్నారు. మండలాలకు, గ్రామపంచాయతీలకు ఎన్నికల సామగ్రిని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సమకూర్చినా, మిగిలిన స్టేషనరీ, ఎన్నికల సామగ్రి రవాణ, సమావేశ బ్యానర్లు, బ్యాలెట్ బాక్సుల మరమ్మతులు, జిరాక్సులు, హమాలీ ఖర్చులు, సిబ్బందికి శిక్షణ, స్నాక్స్, భోజనాలు తదితర ఖర్చుల భారమంతా మండల, జిల్లా అధికారులపైనే పడుతోంది. ఈ అవసరాల కోసం నిధులు లేకపోవడంతో స్థానికంగా ఉన్న స్టేషనరీ దుకాణాల్లో అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఏ ఎన్నికల సమయంలో కూడా ఇలాంటి ఇబ్బందులు పడ్డ దాఖలాలు లేవని అధికారులు అంటున్నారు. ఎన్నికల ఖర్చుల నిమిత్తం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క పైసా కూడా మంజూరు చేయకపోవడంతో ఏర్పాట్లు భారమయ్యేలా ఉందని, ఇప్పటికే పలు మండలాల్లో ఎన్నికల వ్యయం రూ.1.50 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు చేరుకుందని చెబుతున్నారు. అటు పంచాయతీల్లోనూ కార్యదర్శులు రూ.లక్ష వరకు ముందస్తు పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. ఇక గతేడాది ఫిబ్రవరి 2 నుంచి పంచాయతీల్లో ప్రత్యేక పాలన కొనసాగుతుండగా, ఇదే తరహాలో గతేడాది ఆగస్టు నుంచి జిల్లా, మండల పరిషత్‌లలో స్పెషలాఫీసర్ల పాలన నడుస్తోంది. అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు సైతం సక్రమంగా విడుదల కాకపోవడంతో పంచాయతీలు, మండల పరిషత్‌లకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. విధి లేని పరిస్థితుల్లో స్పెషలాఫీసర్లు, కార్యదర్శులు సొంత నిధులతో పల్లెల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ తరుణంలో స్థానిక సంస్థల ఎన్నికలు రావడంతో ఆ సమస్య మరింత తీవ్రం కానుంది. ప్రభుత్వం స్పందించి నోటిఫికేషన్ వచ్చే నాటికైనా ప్రత్యేక ఎన్నికల గ్రాంట్ విడుదల చేయాలని అధికారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

శాంతించిన తాలిపేరు



ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరదనీరు

చర్ల: ఎగువ ప్రాంతం నుంచి వరదనీటి రాక తగ్గుముఖం పట్టడంతో తాలిపేరు శాంతిస్తోంది. నాలుగు రోజుల పాటు ప్రాజెక్టులోకి ఎగువ నుంచి భారీగా వరదనీరు రావడంతో 40 వేల క్యూసెక్కుల వరకు వరదనీటిని అధికారులు విడుదల చేశారు. ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టగా ప్రాజెక్టు గేట్లను మూశారు. కేవలం కేవలం మూడు గేట్లను మాత్రమే ఎత్తి ఉంచి 4,070 క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

టికెట్ల ధరల పెంపు తగదు

భద్రాచలంటౌన్ : ఓజీ సినిమా టికెట్ ధరలు పెంచొద్దని హైకోర్టు స్టే ఇచ్చినా భద్రాచలంలోని ఏషియన్ ఉదయ్‌భాస్కర్ థియేటర్ యాజమాన్యం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. టికెట్ ధరలు రూ.275, రూ.250, రూ.200, రూ.105 ఉండగా, అదనంగా రూ.500, రూ.1000 వరకు వసూలు చేస్తున్నారని, అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో ఈ నెల 6వ తేదీ వరకు విచారణ జరిపించాలని, లేదంటే హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.

రైతులకు భోజన సదుపాయం



రైతులకు భోజనం వడ్డిస్తున్న నాయకులు

పాల్వంచ: పాల్వంచలోని కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయానికి యూరియా కోసం వచ్చే రైతులకు సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేశ్ ఆధ్వర్యాన భోజన వసతి కల్పిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కూడా రైతులకు భోజనం సమకూర్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు పడిగాపులు కాయాల్సి వస్తుండడంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని కనకేశ్ తెలిపారు. కార్యక్రమంలో కిరణ్, ప్రసాద్, రాఘవేంద్ర, శోభన్, అవోక్, వెంకటేశ్వర్లు, అరుణ్, నవీన్, మురళీమోహన్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరుటౌన్: పీవీకాలనీలోని భద్రాద్రి స్టేడియంలో నిర్వహించే దసరా సంబరాల వేడుకలకు ప్రాంగణంలో స్టాళ్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని డీజీఎం పర్సనల్ రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తు స్థానిక జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో అందజేయాలని పేర్కొన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన



వరి పొలంలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వైరా: చింతకాని మండలంలోని కొదుమూరులో పలువురు రైతులు సాగుచేసిన వరి, పత్తి పంటలను మధిర వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. వరుస వర్షాలతో పంటలను తెగుళ్లు ఆశించిన పరిశీలించిన వారు యాజ మాన్య పద్ధతులపై సూచనలు చేశారు. పత్తిలో వడ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములను లీటర్ నీటిలో కలిపి మొక్క మొదళ్ల చుట్టూ పిచికారీ చేయాలని సూచించారు. అలాగే అల్టేరి యా, ఆకుమచ్చ తెగులు, కొమ్మ ఎండు తెగులు, కాయకుళ్లు తెగులు నివారణ చర్యలను వివరించారు. అంతేకాక వరిలో ఆకుల మీద తుప్పు మచ్చలకు జింక్‌లోపం కారణమని నిర్ధారించారు. పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణీదేవి, వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి.సుచరిత, శాస్త్రవేత్తలు కె.నాగస్వాతి, ఫణిశ్రీ పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ఓ దాల్‌మిల్లులో దినసరికూలీగా పనిచేస్తున్న వ్యక్తి మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు బావిలో పడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏపీలోని ఏలూరు లేదా హనుమాన్ జంక్షన్ పరిసర ప్రాంతాలకు చెందిన 60ఏళ్ల వ్యక్తి పేరు కృష్ణగా తెలుస్తోంది. ఆయనమంగళవారం దాల్ మిల్లులో కూలీకి వెళ్లగా అక్కడి బావిలో కాలుజారి పడ్డాడు. దీంతో తోటి కూలీలు బయటకు తీసి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని ఖమ్మం ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చగా, ఆయన ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని ఖమ్మం త్రీటౌన్ పోలీసులు సూచించారు.

పామాయిల్ గెలలు




టన్ను ధర	రూ.19,107

పక్కన గోదారి.. పొలాలు ఎడారి..

నిరుపయోగంగా ఎత్తిపోతల పథకం

- సీతారామ ప్రాజెక్టు కట్ట నిర్మాణ ఫలితం
- ఆయకట్టుకు నీరు అందించాలంటున్న రైతులు



వంతెనపై నిర్మించిన పైప్‌లైన్



కుమ్మరిగూడెం ఎత్తిపోతల పథకం

అశ్వాపురం: అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో దుమ్ముగూడెం ఆనకట్ట సమీపంలో ఉన్న కుమ్మరిగూడెం ఎత్తిపోతల పథకం సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పనుల కారణంగా కాపర్ డ్యాం వల్ల నిరుపయోగంగా మారడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎత్తిపోతల పథకం నిర్మించిన సమయంలో వేయి ఎకరాలు సాగయ్యేది. భారజల కర్మాగారం, సీతారామ ప్రాజెక్ట్, మిషన్ భగీరథ పథకంతో భూములు పోగా ప్రస్తుతం 100 ఎకరాలు సాగవుతోంది. ప్రస్తుతం ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారడంతో రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఎత్తిపోతల పథకానికి, సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌కు మధ్యలో గోదావరికి అడ్డుగా కాపర్ డ్యాం నిర్మించడంతో ఇసుక మేటలతో ఎత్తిపోతల పథకం వద్ద నీరు లేక పొలాలకు నీరు అందడం లేదు. పక్కనే గోదావరి ఉన్నా నీరు రాక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా పొలాలకు నీరు అందించాలని నీటిపారుదల శాఖ అధికారులను రైతులు ఎంతో కాలంగా కోరుతున్నారు. ప్రాజెక్ట్‌లు, పరిశ్రమలకు ప్రజా అవసరాలకు వేయి ఎకరాల తమ భూములు ఇచ్చినా వంద ఎకరాలకు సాగునీరు అందించడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎత్తిపోతల పథకం ద్వారా పొలాలకు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

రూ.కోట్లతో పైపులైన్ నిర్మాణం

సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పనుల్లో ఎత్తిపోతల పథకం పైపులైన్ ధ్వంసమైంది. ఎత్తిపోతల పథకం ద్వారా పొలాలకు నీరు వచ్చేందుకు రూ.కోట్లతో ప్రత్యేకంగా వంతెన నిర్మించి పైపులైన్ ఏర్పాటు చేశారు. అయితే, సరైన నీరు నిల్వ లేకపోవడంతో మోటార్ల ద్వారా నీరు ఎత్తిపోసేందుకు అవకాశం లేకుండాపోయింది. అక్కడ నీటి నిల్వలు లేకపోతే కోట్ల రూపాయల వ్యయంతో పైపులైన్ నిర్మించినా నిరుపయోగంగా మారే అవకాశం ఉంది. దీంతో నిధులు దుర్వినియోగం చేశారని రైతులు పేర్కొంటున్నారు. అసలు నీరు రానప్పుడు పైప్‌లైన్ ఏర్పాటు చేసి లాభమేంటని వారు ప్రశ్నిస్తున్నారు.

నీరు అందించాలి..



కుమ్మరిగూడెం లిఫ్ట్ కింద 100 ఎకరాలు సాగవుతోంది. సీతారామ ప్రాజెక్ట్ కట్ట వల్ల లిఫ్ట్ ద్వారా పొలాలకు నీరు రావడం లేదు. అధికారులకు విన్నవించాం. అధికారులు స్పందించి లిఫ్ట్ ద్వారా పొలాలకు నీరు ఇవ్వాలి.

–ఇమ్మడి అర్జయ్య, రైతు, కుమ్మరిగూడెం

పైపులైన్‌తో ఉపయోగం లేదు..



కుమ్మరిగూడెం లిఫ్ట్ పాత పైపులైన్ సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పనుల్లో పోయింది. ప్రత్యేకంగా వంతెనపై పైపులైన్ నిర్మించారు. లిఫ్ట్ వద్ద కాపర్ డ్యాం వల్ల నీరు లేక పైపులైన్‌తో ఉపయోగం లేదు. ఇకనైనా లిఫ్ట్ ద్వారా పొలాలకు నీరు ఇవ్వాలి.

–కణితి సుబ్బయ్య, రైతు, కుమ్మరిగూడెం

మహిళా ప్రయాణికురాలి హల్‌చల్



ఆర్టీసీ బస్సుకు అడ్డంగా పడుకున్న మహిళ

చుంచుపల్లి: ఆధార్ అనుమతి లేని డీలక్స్ బస్సెక్కిన మహిళా ప్రయాణికురాలు హల్‌చల్ చేసిన ఘటన మంగళవారం కొత్తగూడెం బాబూక్యాంపు వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మణుగూరు నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ డీలక్స్ బస్సును కొత్తగూడెంలో శేషగిరినగర్‌కు చెందిన బోయ చిట్టి ఎక్కింది. బస్సు బాబూక్యాంపు వద్దకు రాగానే కండక్టర్ ఆమెను టికెట్ తీసుకోవాలని కోరారు. ఆమె తన ఆధార్ కార్డును చూపించగా, ఈ బస్సులో ఆధార్ కార్డు చెల్లదని కండక్టర్ సూచించాడు. దీంతో అప్పటికే మద్యం సేవించి ఉన్న ఆమె కండక్టర్‌తో ఎందుకు ఆధార్ చెల్లదంటూ వాగ్వాదానికి దిగింది. బస్సులోని ప్రయాణికులు, డ్రైవర్ సైతం ఆధార్ చెల్లదని ఎంత చెప్పినా ఆమె వినకుండా గొడవ చేస్తూ దిగి బస్సు ముందు అడ్డంగా పడుకొని కొంతసేపు హల్‌చల్ చేసింది. స్థానికులు చుంచుపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకుని ఆమెను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

అనుమతులు లేని ఇసుక సీజ్



ఇసుకను సీజ్ చేస్తున్న ఆర్‌ఐ లీలావతి

అశ్వాపురం: మండలంలోని చింతిరాల క్రాస్‌రోడ్డు సమీపంలో ఎలాంటి అనుమతులు లేని ఇసుక డంపును తహసీల్దార్ మణిధర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్‌ఐ లీలావతి సీజ్ చేశారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

205 కేజీల గంజాయి పట్టివేత

ఒకరు అరెస్ట్, ముగ్గురిపై కేసు



నిందితుడు, గంజాయిని చూపుతున్న పోలీసులు

బూర్గంపాడు: అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని మండలంలోని మోరంపల్లిబంజర వద్ద సోమవారం ఎస్‌ఐ ప్రసాద్ పట్టుకున్నారు. మంగళవారం పాల్వంచ సీఐ సతీశ్ వివరాలు వెల్లడించారు. హరియాణాలోని కురుక్షేత్రకు చెందిన కారు డ్రైవర్ సంజీవకుమార్ తన ఓనర్ ప్రిన్స్‌కుమార్ ఆదేశాల మేరకు చింతూరుకు వచ్చి, ప్రధాన్ కారా, లఖన్ హంతాల్ వద్ద 205 కేజీల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని తన రాష్ట్రానికి తరలిస్తూ మార్గమధ్యలో మోరంపల్లిబంజర వద్ద పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని, కారును స్వాధీనం చేసుకుని కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అక్రమ రవాణాకు సంబంధించి కారు ఓనర్ ప్రిన్స్‌కుమార్, గంజాయి అమ్మిన ప్రధాన్ కారా, లఖన్ హంతాల్‌పై కేసు నమోదు చేశామని, సంజీవకుమార్‌ను అరెస్ట్ చేశామని సీఐ వెల్లడించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.1.02 కోట్లు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఆవులు తరలిస్తున్న వాహనం పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తున్న ఓ వాహనాన్ని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. ఆర్‌టీఏ చెక్‌పోస్టు వద్ద మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఏపీలోని తుని వారపు సంత నుంచి అనుమతులు లేకాండా అశోక్ లేల్యాండ్ వాహనంలో 46 ఆవులను హైదరాబాద్‌లోని తుక్కుగూడ వద్ద కబేళాకు తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. అనంతరం ఆవులను తరలిస్తున్న వ్యక్తితోపాటు వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసి, ఆవులను పాల్వంచలోని గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఇంటిపై సోలార్ విద్యుత్ ప్లేట్లు అమర్చుతుండగా ఘటన

ఇల్లెందు: పట్టణంలోని జగదాంబసెంటర్‌లో ఓ ఇంటిపై సోలార్ విద్యుత్ కోసం ప్లేట్లు అమర్చే క్రమంలో 11 కేవీ విద్యుత్ వైర్లకు తన చేతిలోని ఐరన్ ప్యానల్ తగిలి ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఆంబజార్‌లో నివాసం ఉంటున్న రామాంజనేయులు (48) సోలార్ విద్యుత్ ఏజెన్సీ నడుపుతున్నాడు. మంగళవారం జగదాంబసెంటర్‌లో ఓ ఇంటిపై సోలార్ ప్లేట్లు అమర్చుతుండగా తన చేతిలోని ఐరన్ ప్యానల్ ఇంటిపైన ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌కు తగిలింది. విద్యుదాఘాతంతో రామాంజనేయులు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు సీఐ సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



రామాంజనేయులు (ఫైల్)

వర్కర్లు రాకపోవడంతో..

ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చిన రామాంజనేయులు ఇల్లెందులో సోలార్ ఏజెన్సీ నడుపుతున్నాడు. దసరా పండుగ సమీపిస్తుండటంతో వర్కర్లు ఎవరూ రాలేదు. దీంతో తానే స్వయంగా సోలార్ ప్యానెళ్ల అమర్చేందుకు వచ్చి మృత్యువాత పడటంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

ఓబీ కంపెనీ ప్రతినిధికి దేహశుద్ధి..!

మణుగూరుటౌన్: ఏరియాలోని ఎంఎన్‌జీఓసీలో ఓబీ పనులు దక్కించుకున్న ఓ కంపెనీ వ్యవహారాలు చూసుకునే ప్రతినిధికి దేహశుద్ధి జరిగిన ఘటన మణుగూరులో మంగళవారం చోటుచేసుకుంది. ఓబీ కంపెనీలో పనులు నిర్వహించే ఓ మహిళ పట్ల సదరు వ్యక్తి కొన్ని రోజులుగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. వేధింపులు తాళలేక మహిళ వారి కుటుంబ సభ్యులకు తెలపగా, వారు కంపెనీ ప్రతినిధికి దేహశుద్ధి చేశారు. ఈ విషయమై సింగరేణి అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా, తమ దృష్టికి రాలేదని తెలిపారు.

మాస్టర్ ప్లాన్‌కు కసరత్తు

పాత భవనాలమరమ్మతులకు ప్రతిపాదనలు

- వైస్‌చాన్స్‌లర్, కలెక్టర్‌తో సాగుతున్న చర్చలు
- ప్రభుత్వానికి నివేదించేలా ప్రక్రియలో వేగం
- ప్రారంభమైన బీఎస్సీ క్లాసులు, సాగుతున్న ఎంఎస్సీ అడ్మిషన్లు



ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం కేఎస్‌ఎంలోని డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో నూతన భవనాల నిర్మాణానికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే దోస్త్, స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఇక్కడ జియాలజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్ కోర్సుల్లో 51 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ హాస్టల్ సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ఎమ్మెస్సీలో అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది 110 మంది బాలికలు, 100 మంది బాలురకు సరిపడేలా హాస్టల్ భవనాలను సిద్ధం చేసిన అధికారులు.. భవిష్యత్‌లో అడ్మిషన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా తరగతి గదులు, ల్యాబ్‌లు, హాస్టల్ భవనాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఉన్న భవనాలు, ల్యాబ్‌లకు అవసరమైన మరమ్మతుల కోసం ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

ఇంజనీరింగ్ విభాగంలో 650 మంది..

అయితే, ఇంజనీరింగ్ విభాగంలో ఇప్పటికే 650 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా యూనివర్సిటీకి సంబంధించి మరో 51 మంది విద్యార్థులు నూతనంగా వచ్చారు. ఎంఎస్సీకి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ సాగుతుండడంతో అదనంగా మరికొంత మంది విద్యార్థులు వచ్చే అవకాశం ఉంది. నూ తన భవనాలు నిర్మించే వరకు కూడా బీఎస్సీ, ఎంఎస్సీ విద్యార్థులకు క్లాసురూంలతో పాటుగా హాస్టల్‌లో కూడా సర్దుబాలు చేయాల్సిన అవసరముంది. అన్ని సౌకర్యాలు ఏర్పడే వరకు ఈ సర్దుబా టులు తప్పేలా లేవు. ప్రభుత్వానికి మాస్టర్ ప్లాన్, మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలు నివేదించిన అనంతరం నిధులు విడుదల అయితే పనులు ప్రార ంభించనున్నారు. యూనివర్సిటీలో మొదటి బ్యాచ్ విద్యార్థులకు గుర్తిండిపోయే విధంగా క్లాసులు నిర్వహించడం, సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కూడా విద్యార్థులకు హామీ ఇచ్చి, అదే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

యూనివర్సిటీలో నూతన భవనాల నిర్మాణం కోసం మాస్టర్‌ప్లాన్ రెడీకి కసరత్తు చేస్తు న్నాం. దీంతో పాటుగా ప్రస్తుతం యూనివర్సిటీలో ఉన్న పాత భవనాలు, ఓల్డ్ షెడ్‌లకు సంబంధించి మరమ్మతులు, లీకేజీలకు సంబంధించిన ప్రతిపాదనలు సైతం సిద్ధం చేస్తున్నాం. అన్నింటినీ ప్రభుత్వానికి నివేదించి నిధులు విడుదలైన తరువాత పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంటుంది.

–జగన్మోహన్‌రాజు, యూనివర్సిటీ ఓఎస్‌డీ

యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, కలెక్టర్‌తో చర్చలు..

డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో నూతన భవనాలను నిర్మించేందుకు గానూ రెండు రోజుల క్రితం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ యోగితారాణాతో హైదరాబాద్‌లో అధికారులు సుదీర్ఘ చర్చలు జరిపారు. మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేసేందుకు గాను ఆర్కిటెక్చర్లకు బాధ్యతలు అప్పగించారు. ఇదే క్రమంలో యూనివర్సిటీలో ఉన్న అవసరాలు, నూతన పరికరాలు, భవనాల మరమ్మతులకు అవసరయ్యే ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు గాను కలెక్టర్‌తో సోమవారం యూనివర్సిటీ అధికారులు చర్చలు జరిపారు. ప్రస్తుతం యూనివర్సిటీలో ఉన్న భవనాలు, వాటిలో ఉన్న సమస్యలు, ఓల్డ్ షెడ్లను తొలగించి వాటి స్థానంలో నూతన నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేసే పనిలో అధికారులు ఉన్నారు. అయితే మాస్టర్ ప్లాన్‌తో పాటుగా పాత భవనాలకు సంబంధించిన మరమ్మతుల ప్రతిపాదలు, నూతన పరికరాల ప్రతిపాదనలను అన్నింటిని కలిపి ప్రభుతానికి నివేదించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అభివృద్ధికి సహకరించండి..



సింగరేణి సీఎండీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): రామవరం, రుద్రంపూర్ ప్రాంతాల్లో మాజీ కార్మికులు నివసిస్తున్న క్వార్టర్లను వారికే కేటాయించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. మంగళవారం రాత్రి కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సీఎండీ బలరాంను ఆయన చాంబర్‌లో కలిశారు. పట్టణం, పరిసర ప్రాంతాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు సింగరేణి సంస్థ సహకరించాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్మిక వాడలు, ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు కనీస వసతుల కల్పనలో యాజమాన్యం చొరవ చూపాలన్నారు. ఎమ్మెల్యే వెంట ఎస్‌కే సాబీర్‌పాషా, వంగా వెంకట్, రమణమూర్తి తదితరులు ఉన్నారు.

అవగాహన సదస్సులో ఏపీఓ జనరల్

హిమాచల్‌ప్రదేశ్ వెళ్లి వచ్చిన డేవిడ్‌రాజ్



సదస్సులో మాట్లాడుతున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన నిషేధిత మత్తు పదార్థాలపై అవగాహన సదస్సుకు భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు. శిక్షణ అనంతరం భద్రాచలం వచ్చిన ఆయన.. మంగళవారం వివరాలు వెల్లడించారు. గిరిజన యువత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా అవగాహన కల్పించారని, రాష్ట్ర ముఖ్య కార్యనిర్వహణ అధికారి నిఖిల, తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రతిపాదన మేరకు సదస్సులో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. త్వరలో మారుమూల ఆదివాసీ గ్రామాల్లో యువకులకు ప్రత్యేక శిక్షణ అందించి ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

భక్తుల కొంగు బంగారం కోటమైసమ్మ తల్లి..



ముస్తాబైన నిజాంపేట కోటమైసమ్మ ఆలయం



కొలువుదీరిన కోటమైసమ్మ తల్లి

ఇల్లెందురూరల్: దశాబ్దాలుగా జనం చేత పూజలందుకుంటూ ప్రసిద్ధికెక్కిన నిజాంపేట కోటమైసమ్మ అమ్మవారి జాతర బుధవారం నుంచి ప్రారంభమవుతోంది. ఏటా విజయదశమి సందర్భంగా రెండు రోజులపాటు అమ్మవారి జాతరను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మండలంలోని రేపల్లెవాడ గ్రామపంచాయతీ నిజాంపేట సమీపంలో సుమారు ఐదు దశాబ్దాల క్రితం వెలిసిన కోటమైసమ్మ తల్లి ఆలయంలో ఏడాది పొడవునా పూజా కార్యక్రమాలు జరుగుతుంటాయి. విజయదశమి పురస్కరించుకొని బుధవారం గ్రామస్తులు బోనాలతో ప్రదర్శనగా తరలివచ్చి అమ్మవారికి సమర్పిస్తారు. గురువారం శక్తిస్వరూపిణిగా దర్శనమిచ్చే అమ్మవారికి పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా సింగరేణి ఉద్యోగి



ఉదయ్‌కుమార్



మురళి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో మేనేజ్‌మెంట్ ట్రెయినీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొయ్యాడ ఉదయ్ కుమార్ ఇటీవల వెల్లడైన గ్రూప్–1 ఫలితాల్లో సత్తా చాటి మున్సిపల్ కమిషనర్ గ్రేడ్–2గా ఎంపికయ్యారు. ఆయన గతేడాది సింగరేణి ఉద్యోగానికి ఎంపిక కాగా విధులు నిర్వర్తిస్తూనే గ్రూప్–1కు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా ఉదయ్‌ను సీఎండీ ఎన్.బలరామ్, డైరెక్టర్, జీఎం వెల్ఫేర్ కిరణ్‌కుమార్ అభినందించారు. కాగా, ఉదయ్‌కుమార్ తమ్ముడు ప్రణయ్‌కుమార్ 2023లో ఐఏఎస్‌గా ఎంపికై నారాయణపేట జిల్లాలో ట్రెయినీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. జనగామ జిల్లా రఘునాథపల్లికి చెందిన ప్రభాకర్ – లక్ష్మి దంపతుల పెద్దకుమారుడు ఉదయ్ మున్సిపల్ కమిషనర్‌గా, రెండో కుమారుడు ఐఏఎస్‌కు ఎంపిక కాగా చిన్నకుమారుడు పృథ్వీకుమార్ ఎల్‌ఎల్‌బీ పూర్తిచేశారు. అయితే, ఎంబీఏ చదివిన ఉదయ్ తన లక్ష్యం ఐఏఎస్ సాధించడమేనని తెలిపారు.

ఇల్లెందు ఉద్యోగికి గ్రూప్–2

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా అకౌంట్ ఆఫీసర్ కొమ్ము మురళి గ్రూపు–2 ఉద్యోగానికి ఎంపికయ్యారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం గ్రామానికి చెందిన ఆయన సింగరేణిలో ఉద్యోగం చేస్తూనే గ్రూపు–2 రాసి 139వ ర్యాంకు సాధించారు. తెలంగాణ సెక్రటేరియట్‌లోని జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఏఎస్ఓగా పోస్టింగ్ లభించింది.

కొబ్బరికాయ ధరలకు రెక్కలు

పండుగ వేళ రూ.40కి పైగానే విక్రయం



కొబ్బరికాయల సైజ్ ఆధారంగా గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: కొబ్బరికాయల ధరలకు రెక్కలొచ్చాయి. శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతుండడం, దసరా సమీపించిన నేపథ్యాన కొబ్బరికాయలకు డిమాండ్ పెరిగింది. దీంతో ప్రాంతాలు, కాయ సైజు ఆధారంగా ఒక్కో కొబ్బరికాయను రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. కార్పొరేట్ మాల్స్‌లో రూ.40 చొప్పున విక్రయిస్తుండగా, రిటైల్ దుకాణాల్లో రూ.45, గ్రామాల్లో రూ.50కి అమ్ముతున్నారు. అంతేకాక ఆలయాల వద్ద ఈ ధరలు మరింత ఎక్కువ ఉంటున్నాయి. నిన్నామొన్నటి వరకు వినియక చవితి ఉత్సవాలు సాగగా, ప్రస్తుతం శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతుండడం.. మరోపక్క భక్తులు భవానీ దీక్ష, అయ్యప్ప దీక్ష ధరిస్తుండడంతో కొబ్బరికాయలకు డిమాండ్ పెరిగింది. ఏపీలోని గోదావరి జిల్లాలు, కేరళ రాష్ట్రం నుంచి ఖమ్మంలోని హోల్‌సేల్ వ్యాపారులు దిగుమతి చేసుకుని సైజు ఆధారంగా గ్రేడింగ్ అనంతరం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు సరఫరా చేస్తున్నారు.

దిగుబడి తగ్గడంతో..

కొబ్బరి పంట దిగుబడి ఆశించిన మేర లేకపోవడంతోనే డిమాండ్ పెరిగిందని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. దీనికి తోడు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో వినియోగం పెరగడం ఇంకో కారణంగా చెబుతున్నారు. గోదావరి జిల్లాలు, కేరళ రాష్ట్రానికిఆర్డర్ చేసినా సమయానికి రావడం లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు.